క్లుప్తంగా

నాణ్యమైన తాగునీరు సరఫరా చేయాలి

కపిలేశ్వరపురం: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో సంబంధిత అధికారులు విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదేశించారు. అంగర పంచాయతీ పరిధిలోని వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకులను మంగళవారం ఆయన సందర్శించారు. వాటిని శుభ్రపరుస్తున్న తీరును పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు ఎంపీడీవోకు వివరించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు సరఫరా చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రహదారిని పునర్నిర్మించాలి

కాజులూరు: మండలంలోని ఒంటితాడి–తాళ్లరేవు రహదారిని పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు పువ్వుల మీరాసాహెబ్ తదితరులు కోరుతున్నారు. మంగళవారం గ్రామంలో మీరాసాహెబ్, పలువురు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒంటితాడి, శీలలంక గ్రామాల ప్రజలు నిత్యావసరాలకు, ఇతర పనులకు తాళ్లరేవు వెళ్లి వస్తుంటారన్నారు. రహదారి శిథిలమై 15 సంవత్సరాలుగా మరమ్మతులకు సైతం నోచుకోకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటు కాజులూరుకి వచ్చే రహదారి అంతే అధ్వానంగా ఉందని అధికారులు స్పందించి రహదారి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.

రేపు ఆలయ పునరుద్ధరణ కమిటీ సమావేశం

రామచంద్రపురం: పట్టణంలోని బాలత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణ కమిటీ సమావేశం ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయం అభివృద్ధి, పునరుద్ధరణపై చర్చిస్తారని శివాలయం ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సమావేశానికి భక్తులు, స్థానికులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

దాడి ఘటనపై కేసు

రాయవరం: మండలంలోని చెల్లూరు గ్రామానికి చెందిన కొమ్ము శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 6న శేషమ్మ తన ఇంటి వద్ద ఉండగా, ఆమె ఇంటి పక్కన నివాసం ఉంటున్న రాజేష్ అతనితో పాటుగా చంద్రు సతీష్, సుబ్బారావులు ఆమెను దూషించసాగారు. ఎందుకు తిడుతున్నారంటూ శేషమ్మ వారిని ప్రశ్నించగా, సుబ్బారావు నీకేమిటి చెప్పేది? అంటూ ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆస్పత్రిలో శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన భక్తులు మంగళవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. మండపేట మండలంలోని ఏడిదకు చెందిన కె.చంద్రప్రకాష్ కుటుంబం మంగళవారం ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,11,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాస్, కేసరి నాగమణి, బచ్చు మాధవికృష్ణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో నిరుపేద కుటుంబానికి చెందిన గొడితి త్రిమూర్తులు గృహ నిర్మాణానికి రూ.1.30 లక్షల ఆర్థిక సాయం పంపిణీ జరిగింది.. ఇటీవల త్రిమూర్తులు నివాసం ఉంటున్న పెంకుటిల్లు పూర్తిగా శిథిలమై పడిపోయింది. దీనిపై స్పందించిన పలువురు గ్రామస్తులు పునరావాసం నిమిత్తం విరాళాలు సేకరించి గుమ్మిలేరు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు చేతుల మీదుగా ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, అల్లూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఎల్‌డీసీ, యూడీసీ పరీక్ష

యానాం: పుదుచ్చేరిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎల్‌డీసీ, యూడీసీ పోస్టుల భర్తీకి రాత పరీక్ష ఏప్రిల్‌లో నిర్వహిస్తామని సీఎం రంగసామి పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చారు. ప్రస్తుతం ఇంటర్, ప్లస్ టు పరీక్షలు జరుగుతున్నాయని, ఈ పరీక్షలు పూర్తయిన వెంటనే వచ్చే నెలలో రాత పరీక్షను నిర్వహిస్తామన్నారు. ఎన్నడూ లేని విధంగా సుమారు 10వేల ఖాళీలను భర్తీ చేస్తున్నామని వీటి కోసం వేగంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

జంక్షన్లో ట్రాఫిక్ జామ్

- పట్టణాన్ని వేధిస్తున్న సమస్య
- ప్రయాణికులకు తప్పని అవస్థలు


బస్టాండు వద్ద ట్రాఫిక్ రద్దీ

మండపేట: మండపేట పట్టణాన్ని ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది. ప్రధాన సెంటర్ల వద్ద తరచూ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నలింగ్ వ్యవస్థ లేకపోవడంతో వాహనచోదకుల మధ్య అవగాహన లోపంతో సెంటర్ల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

విద్య, ఉద్యోగం, వ్యాపారం తదితర పనుల నిమిత్తం మండపేటలో స్థిరపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆ మేరకు పట్టణ విస్తీర్ణం పెరిగింది. పదేళ్ల క్రితం జనాభా 41,000 ఉండగా ప్రస్తుతం 64,000 పెరిగింది.దీనికితోడు వివిధ పనుల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే వారితో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. పట్టణంలోని ప్రధానమైన బస్టాండు, కలువపువ్వు, రాజారత్న, కరాచి సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ లేకపోవడంతో ఈ సెంటర్ల వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంటోంది. వాహన చోదకులు ఎవరికి వారు ముందుగా వెళ్లేందుకు చేసే ప్రయత్నాలతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోవడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బస్టాండు వద్ద పరిస్థితి మరింత గందరగోళంగా ఉంటోంది. రామచంద్రపురం వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే బస్సులు, రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం వైపునకు వెళ్లే బస్సులు బస్టాండు వద్ద మలుపు తిరిగి వెనక్కి వెళుతుంటాయి. బస్సులు మలుపు తిరిగేందుకు ఖాళీ తక్కువగా ఉండడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బైపాస్ రోడ్డు, కపిలేశ్వరపురం రోడ్డు మీదుగా వచ్చే లోడు లారీలు, ఇతర వాహనాలు రాజారత్న సెంటర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. వాణిజ్య కేంద్రమైన కలువపువ్వు సెంటర్, అలాగే కరాచీ సెంటర్లోను ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కరవయ్యాయి. నాలుగు ప్రధాన సెంటర్ల వద్ద ట్రాఫిక్ ఐలాండ్స్ నిర్మాణం కోసం గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే నిర్వహించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఇటీవల జరిగిన మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు ట్రాఫిక్ సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా పోలీసులు, అధికారులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


కలువపువ్వు సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీ

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


తరగతి గదిలో టేబుళ్లపై హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయుడు


రాయవరం పరీక్ష కేంద్రంలో హాల్ టిక్కెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

మండపేటలో ఆరు కేంద్రాల ఏర్పాటు

మండపేట: బుధవారం నుంచి మొదలయ్యే ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని ఎంపీఎస్ జూనియర్ కళాశాల, విద్యావికాస్, ఆదిత్య, విజ్ఞాన్, శ్రీవైష్ణవి ఒకేషనల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 2,103 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా వారిలో జనరల్ విద్యార్థులు 1,688 మంది, ఒకేషనల్ విద్యార్థులు 415 మంది ఉన్నారని కస్టోడియన్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, హాల్ టికెట్లతో విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్లు దాదాపు 130 మంది పరీక్షల విధుల్లో పాల్గొంటారన్నారు. పరీక్షల నిర్వహణపై కస్టోడియన్లు సూర్యనారాయణరెడ్డి, ఎన్ సురేష్‌రెడ్డిలు మంగళవారం ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన ఆర్డీవో

ఇంటర్ పరీక్షలు నేపథంలో మంగళవారం రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం మండపేటలో పర్యటించారు. పట్టణంలో పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన ఆరు కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో..

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ డీవీవీ నాగేశ్వరరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. కళాశాల విద్యార్థులతో పాటుగా, స్థానిక విజ్ఞాన్, బిక్కవోలు ప్రజ్ఞ జూనియర్ కళాశాల, రాయవరం, బిక్కవోలు మండలం పందలపాక ప్లస్ టూ హైస్కూల్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజు పరీక్ష కేంద్రంలో 350 మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 14 తరగతి గదులను విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధం చేశామని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. .

కోరగానే కాలనీకి రోడ్డు నిర్మాణం


కపిలేశ్వరపురం కాలనీలో రహదారి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

కపిలేశ్వరపురం: స్థానిక జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయంతో ఉత్సాహంగా ఇళ్ళను నిర్మించుకుంటున్నారు. అయితే కాలనీలో శివారు ప్రాంతంలో సుమారు 25 ఇళ్ళ నిర్మాణాలకు రహదారి సమస్య తలెత్తింది. కాలనీ ప్రధాన రహదారి నుంచి శివారుకు కొనసాగింపుగా నూతన రహదారిని నిర్మించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఈ నెల 4న వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా తదితర వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్సీ తోట రహదారి నిర్మాణానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా రూ.3 లక్షల మండల పరిషత్ సాధారణ నిధులతో రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులను పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు మంగళవారం పర్యవేక్షించారు. లబ్దిదారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మండపేట: మండలంలోని కేశవరంలో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎలక్ట్రికల్ ఏడీఈ జి.తిరుమలరావు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు మంగళవారం ఆయన ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి కేశవరంలో పర్యటించారు. గ్రామంలో కిందికి వేలాడుతున్న వైర్లు, జగనన్న కాలనీలో విద్యుత్‌లైన్లు, వత్సవాయి చెరువు వద్ద రజక సంఘం ధోబీఘాట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ పనులు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రజక సంఘం అధ్యక్షుడు రేగులబంద మాధవ్ కృష్ణ, సంఘ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు కట్టుదిట్టం

రామచంద్రపురం: డివిజన్ పరిధిలో జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు రామచంద్రపురం ఆర్డీవో పి.సింధూ సుబ్రహ్మణ్యం తెలిపారు. నేటి నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను ఆర్డీవో సింధూ మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 13 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నట్లు తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సుల సదుపాయాన్ని కల్పించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులతో పాటు తహసీల్దార్‌లు, ఎంఈవోలు పాల్గొన్నారు.


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో సింధూ సుబ్రహ్మణ్యం

పీహెచ్‌సీ ఆవరణలో పందుల బెడద


గొల్లపాలెం పీహెచ్‌సీ ఆవరణలో రాత్రి పూట సంచరిస్తున్న పందులు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో పీహెచ్‌సీ ఆవరణలో పందుల బెడద రోజురోజుకీ అధికమౌతుంది. పందుల సంచారంతో ప్రమాదకరమైన అంటు వ్యాధులు సోకుతాయని వైద్యులు సూచిస్తుండగా వైద్యాలయం ఆవరణలోనే అవి యథేచ్ఛగా తిరుగుతుండటంతో స్థానికులు విస్మయానికి గురవుతున్నారు. పలు వ్యాధులపై చికిత్స నిమితం పీహెచ్‌సీకి వచ్చేరోగులకు నిత్యం పందులు ఎదురువచ్చి స్వాగతం పలుకుతుండటంతో రోగులు ఆందోళనలకు గురవుతున్నారు. వ్యాధుల నుంచి స్వస్తత కోసం వస్తుంటే కొత్త వ్యాధులు సోకేలా ఉన్నాయని పలువురు రోగులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పెంపకందార్లు విచక్షణా రహితంగా గ్రామంలోకి వదులుతూ వాటి నిర్వహణను పట్టించుకోవటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పందులు పగలంతా గ్రామ వీధుల్లో తిరుగుతూ రాత్రుళ్లు పీహెచ్‌సీలోనే మకాం వేస్తున్నాయి. పలుచోట్ల గృహవాసాల మధ్య పందులు చనిపోతున్నప్పటికీ వాటిని ఎవరూ తొలగించకపోవడంతో భరించలేని దుర్వాషన వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పందుల స్వైరవిహారాన్ని నిరోధించాలని స్థానికులు వీరవల్లి గణపతి, సాయి, సునీల్ తదతరులు డిమాండ్ చెస్తున్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ తదితరులు


రాయవరంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ, డీఎల్‌డీవో శాంతి తదితరులు


అముజూరులో విద్యార్థికి మాత్ర వేస్తున్న సర్పంచ్ కల్యాణి

మండపేట: నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండపేట పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వలన నులి పురుగులు వ్యాపిస్తాయన్నారు. పిల్లల్లో రక్తహీనతను నివారించేందుకు విధిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు.కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, మండిపూడి చంద్రశేఖర్, పుత్సల కాశీ, సుంకర బాలాజీ, పిల్లా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

89 శాతం మాత్రల పంపిణీ

కపిలేశ్వరపురం: మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్యులు జె.అనూజ ప్రియాంక, పి.చంద్రమౌళి పర్యవేక్షణలో లక్ష్యంలో 89 శాతం మాత్రల పంపిణీ మంగళవారం పూర్తి చేశారు. మండలంలోని 19 గ్రామాల్లోని విద్యాలయాల్లో మాత్రలను పంపిణీ చేయడంలో వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు విశేషంగా కృషి చేశారు. ఆయా గ్రామాల్లో మాత్రల పంపిణీ పీఎంసీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల ప్రముఖులు ప్రారంభించారు. అంగర పీహెచ్‌సీ పరిధిలో 4,584 మందికి మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా, 4,121 మందికి పంపిణీ చేశారు. బడిబయట పిల్లలు, డ్రాప్ అవుట్ పిల్లలకు ఈనెల 18న మాప్ అప్ కార్యక్రమంలో మాత్రలను పంపిణీ చేయనున్నారు.

రాయవరం: చిన్నారుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి ఎ.శాంతి, ఎంపీడీవో డి.శ్రీనివాసు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎ.దేవి రాజశ్రీ తదితరులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటుగా, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

80 శాతం మాత్రల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యం 80 శాతం పూర్తైనట్టు పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలను వేయించారు. ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా మాత్రలను పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు జాతీయ డీవార్మింగ్ కార్యక్రమం దోహదపడుతుందని ప్రజాప్రతినిధులు అన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన


కొత్తపేటలో సీసీ డ్రైన్ పనులు ప్రారంభించిన ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రజల ఆర్థిక అవసరాలు తీరేలా వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరోపక్క రోడ్లు, డ్రైన్లు, వివిధ ప్రాజెక్టుల నిర్మాణంతో ఆదర్శ రాష్ట్రమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మంగళవారం స్థానిక గౌతమినగర్‌లో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్ నిర్మాణానికి ఎంపీపీ మార్గన కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలకిచ్చిన మాట, హామీలకు అనుగుణంగా నవరత్నాలు, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ప్రజల ఆర్థికావసరాలు తీరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, జిల్లా సాంస్కృతిక విభాగం చైర్మన్ సత్తిరాజు ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు రేవాడి నాగలక్ష్మి, మండల సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ సభ్యులు పిల్లి అనంతలక్ష్మి, బొక్కా లోకేష్, పార్టీ బీసీ విభాగం సభ్యుడు రాయుడు శేఖర్, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ వీవీ రామన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం

యానాం: అయ్యన్ననగర్ మత్స్యకార గ్రామంలో గురువారం ప్రభుత్వ ఆయుర్వేదం, హోమియో వైద్యులు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు మంగళవారం మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో విష జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడేవారికి వైద్యం అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


వెల్ల పీహెచ్‌సీ వద్ద చిన్నారులతో మాత్రలు మింగిస్తున్న డివిజన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివరంజని


ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో చిన్నారులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీపీ భవాని

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం డివిజన్ పరిధిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని 95 శాతం మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు రామచంద్రపురం డివిజన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివరంజని అన్నారు. మండలంలోని వెల్ల పీహెచ్‌సీ వద్ద కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఒకటో సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారు 81,371 మంది చిన్నారుల ఉండగా 77,852 మంది చిన్నారులకు మాత్రలు మింగించినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 18న ఇస్తామన్నారు.

కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు మమత, ఎస్వీ ఆదినారాయణ, డివిజన్ సూపర్‌వైజర్ కె.గోవిందబాబు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఈశ్వరమ్మ, కమల్‌శేషు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.రాంబాబు, ఆరోగ్య సిబ్బంది. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ అంబటి భవాని చిన్నారులకు మాత్రలు మింగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ అహ్మద్ అలీషా, పార్టీ జిల్లా కార్యదర్శి నున్న కల్యాణ్, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్‌నాయుడు, హెచ్‌ఎం పీఎస్ బీఎస్‌కే సుందరి, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోఖలే కాంస్య విగ్రహం రూపకల్పన

- కొత్తపేట వుడయార్ శిల్పశాలలో..
- నమూనా విగ్రహాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ కుడుపూడి


కొత్తపేటలో గోఖలే విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

కొత్తపేట: ఐపీఎస్, డీజీపీగా పనిచేసిన కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే కాంస్య విగ్రహాన్ని త్వరలో అమలాపురంలో నెలకొల్పనున్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తండ్రి అయిన గోపాలకృష్ణ గోఖలే కాంస్య విగ్రహాన్ని అమలాపురం టౌన్ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పనున్నారు. ఆ విగ్రహాన్ని రూపొందించే బాధ్యతను కొత్తపేటలో అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్‌వుడయార్‌కు అప్పగించారు. ఆ మేరకు పోలీసు అధికారి రూపంలో గోఖలే నమూనా విగ్రహాన్ని ఇప్పటికే రూపొందించగా మంగళవారం ఎమ్మెల్సీ కుడుపూడి ఆ విగ్రహాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఈ విగ్రహాన్ని చూస్తుంటే అప్పటి యంగ్ ఏజ్‌లో పోలీసు అధికారిగా ఆయన మన కళ్ల ముందున్న భ్రాంతి కలుగుతుందన్నారు. జీవకళ ఉట్టిపడేలా విగ్రహాన్ని మలిచిన రాజ్‌కుమార్ శిల్పకళా నైపుణ్యాన్ని అభినందించారు. ఆయన వెంట అమలాపురం కౌన్సిలర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని వెంకటచంద్రశేఖర్, జిల్లా పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

త్వరలో ఆయుష్మాన్ భారత్ బకాయిలు చెల్లింపు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయి మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు పుదుచ్చేరి సీఎం రంగసామికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో జీజీహెచ్‌లో అధునాతన లేబొరేటరీతోపాటు వివిధ విభాగాలను ఏర్పాటు చేస్తున్నారని ప్రకటించారని దీనికి యానాం ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. జీజీహెచ్‌కు ఇప్పుడు ఇస్తున్నవే కాకుండా మరిన్ని మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. జీజీహెచ్‌లో స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులను అవుట్‌సోర్సింగ్‌పై భర్తీ చేయనున్నట్టు, అదేవిధంగా సాంకేతిక సిబ్బందిని ఈ ఏడాదికి రిక్రూట్‌మెంట్ ద్వారా పర్మినెంట్‌గా తీసుకోనున్నామని ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిచ్చారు. అలాగే ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్య పథకం ద్వారా వివిధ కార్పొరేట్ ఆసుపత్రుల్లో రోగులకు జరిగిన చికిత్సలకు సంబంధించి పెండింగ్ బిల్లులు పేరుకుపోయి ఉన్నాయని, వాటికి బిల్లులు మంజూరు చేస్తారని ఎమ్మెల్యే అశోక్ ప్రశ్నించగా వాటిని త్వరతగతిన చెల్లించనున్నట్టు సమాధానమిచ్చారు.